# సీఎంను మించిన గ్యారంటీ లేదు

- పేదలకు బీఆర్ఎస్ ప్రభుత్వమే శ్రీరామరక్ష
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో మహిళలకు పెద్దపీట
- విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్




బంజారాహిల్స్,అక్టోబర్ 17: తెలంగాణ ప్రజలకు గత పదేళ్లుగా సుస్థిరమైన పాలన అందిస్తూ పేదల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్న కేసీఆర్‌ను మించిన గ్యారంటీ మరేదీ లేదని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. మంగళవారం జూబ్లీహిల్స్ లోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే దానం నాగేందర్ మాట్లాడుతూ.. ఖైరతాబాద్ నియోజకవర్గంలో గత ఐదేళ్లలో ప్రభుత్వం తరపున వచ్చిన అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు అందించామన్నారు. పేదింటి ఆడబిడ్డల పెళ్లిళ్ల కోసం కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ పథకాలు అందుకున్న తల్లిదండ్రుల ముఖాల్లో కనిపించిన సంతోషానికి మించిన గ్యారంటీలు ఏమున్నాయన్నారు. పుట్టిన బిడ్డ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో కేసీఆర్ కిట్స్, పౌష్టికాహారం అందించి మానవత్వాన్ని చాటుకున్న ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మించిన గ్యారంటీ తెలంగాణ ప్రజలకు మరేదీ లేదన్నారు. గురుకుల పాఠశాలల ఏర్పాటు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం, ఉచిత మంచినీటి సరఫరా, గృహలక్ష్మి, దళితబంధు లాంటి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి అమలు పరుస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని ప్రజలు మరోసారి గ్యారంటీగా గెలిపించి తీరుతారన్నారు. జాతీయ పార్టీగా చెప్పుకునే కాంగ్రెస్ పార్టీ రాష్ట్రానికో విధానం అమలు పరుస్తూ మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందన్నారు. తెలంగాణలో ఓట్లు అడగడానికి ముందు తాము పాలిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు.

### బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో మహిళలకు పెద్దపీట

తెలంగాణ రాష్ట్రంలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రావడం ఖాయమని, పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన అన్ని పథకాలను ప్రజలకు అందించడం ఖాయమని ఎమ్మెల్యే దానం పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం విపరీతంగా గ్యాస్ సిలిండర్ ధరలు పెంచినప్పుడు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేసిన విషయాన్ని గుర్తించిన ముఖ్యమంత్రి కేసీఆర్ వారిపై భారం తగ్గించేందుకు రూ.400కే గ్యాస్ సిలిండర్‌ను అందించాలని నిర్ణయించారన్నారు. అర్హులైన పేద మహిళలకు సౌభాగ్యలక్ష్మి పథకం కింద నెలకు రూ.3వేలు అందిస్తామన్నారు. కేసీఆర్ ఆరోగ్యరక్ష పథకం కింద రూ. 15లక్షల ఆరోగ్య భీమా అందిస్తామని,రేషన్ కార్డుదారులందరికీ ప్రభుత్వమే ప్రీమియం చెల్లించి రూ.5లక్షల జీవిత బీమా అందిస్తుందన్నారు. తెల్లకార్డుదారులందరికీ రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం అందిస్తామని, అసరా పించన్లను రూ.3016కు పెంచడంతో పాటు ప్రతియేటా రూ.500చొప్పున పెంచుతామన్నారు. మహిళా సమాఖ్యలకు సొంతభవనాలను నిర్మించి ఇస్తామని, అగ్రవర్ణ పేదల కోసం గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేస్తామన్నారు. గురువారం నుంచి నియోజకవర్గంలో ఎన్నికల ప్రచారం ప్రారంభించనున్నామని, బూత్‌స్థాయిలో స్థానిక కార్యకర్తలు ప్రచారం చేస్తున్నారన్నారు.



బంజారాహిల్స్: శ్రీనగర్ కాలనీలో అన్నపూర్ణదేవి అవతారంలో శ్రీ భ్రమరాంబ దేవి



బంజారాహిల్స్: మాగంటి కాలనీలో శ్రీ విజయకనకదుర్గ అమ్మవారు



బంజారాహిల్స్ రోడ్డు నంబర్2లోని ఇందిరానగర్‌లోని అమ్మవారి ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న దృశ్యం



### జలమండలి కార్యాలయంలో శరన్నవరాత్రి పూజలు

బంజారాహిల్స్ రోడ్డు నంబర్10లోని తట్టిఖానా సెక్షన్ జలమండలి కార్యాలయంలో దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక పూజలకు జలమండలి డివిజన్-6 జీఎం హరిశంకర్‌తో పాటు డీజీఎంలు, సెక్షన్ మేనేజర్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో సెక్షన్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

– బంజారాహిల్స్,అక్టోబర్ 17:




### ముమ్మరంగా వాహన తనిఖీలు

శాసనసభ ఎన్నికల కారణంగా ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాల పరిధిలో వాహన తనిఖీలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసిన పోలీసులు తనిఖీలు చేస్తున్నారు. వీరితో పాటు స్టాటిక్ సర్వైలెన్స్ బృందాలతో వాహనాలను తనిఖీలు చేస్తూ నగదు, మద్యం స్వాధీనం చేసుకుంటున్నారు.

–బంజారాహిల్స్.అక్టోబర్ 17:

## యువకుడు ఆత్మహత్య

ఉస్మానియా యూనివర్సిటీ, అక్టోబర్ 17: ప్రేమ వైఫల్యంతో యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై రవి తెలిపిన వివరాల ప్రకారం ఆదిలాబాద్ రామ్‌నగర్‌కు చెందిన శ్రీరామ్ (23) అనే యువకుడు మాణికేశ్వరీనగర్‌లో అద్దెకు ఉంటూ సిటీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఇటీవలే పీజీ ప్రవేశ పరీక్షలో కాకతీయ యూనివర్సిటీ సీటు వచ్చినప్పటికీ ఇంకా చేరలేదు. సోమవారం మధ్యాహ్నం తలుపుతీయకపోవడంతో సందేహం వచ్చిన ఇంటి యజమాని శ్రీరామ్ తండ్రికి సమాచారం అందించాడు. శ్రీరామ్ స్నేహితుడిని అక్కడికి పంపించగా, వారు పోలీసులకు సమాచారం అందించారు. తలుపులు పగలగొట్టి చూడగా శ్రీరామ్ ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బీసీలు ఐక్యం కావాలి



మాట్లాడుతున్న బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రమేశ్‌యాదవ్

ఖైరతాబాద్, అక్టోబర్ 17 : దేశ జనాభాలో అత్యధిక శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారం దిశగా అడుగులు వేయాలని బీసీ ఐక్యవేదిక అధ్యక్షుడు రమేశ్‌యాదవ్ పిలుపునిచ్చారు. మంగళవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. అన్ని రాజకీయ పార్టీలు బీసీలకు తగిన ప్రాధాన్యత కల్పించాలన్నారు. బీసీలకు అవకాశం కల్పించిన వారికి మద్దతుగా నిలుస్తామన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. ఓటు హక్కును వినియోగించుకోని వారికి సంక్షేమ పథకాలను నిలిపివేయాలన్నారు. బీసీలు ఐక్యతను చాటేందుకు త్వరలోనే భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ సమావేశంలో బీసీ ఐక్యవేదిక నాయకులు మహేశ్, ఆంజనేయులు, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

### 'చట్ట సభల్లో బుడగ జంగాలకు ప్రాధాన్యం కల్పించాలి'

ఖైరతాబాద్, అక్టోబర్ 17 : చట్ట సభల్లో బుడగ జంగాలకు ప్రాధాన్యత కల్పించాలని ఆలిండియా బేడ బుడగ జంగం వెల్ఫేర్ ఫెడరేషన్ అధ్యక్షుడు డాక్టర్ చింతల యాదగిరి కోరారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎస్సీలుగా ఉన్న బుడగ జంగాలకు ఇప్పటి వరకు ఏ పార్టీ సరైన ప్రాతినిధ్యం కల్పించలేదన్నారు. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన దళితబంధు పథకాన్ని తమకూ వర్తింపజేయాలని కోరారు. ఈ సమావేశంలో ఫెడరేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ చిత్తరి అంతయ్య, ప్రధాన కార్యదర్శి తూర్పాటి పాండు, పొలిటికల్ వింగ్ చైర్మన్ నర్సయ్య, ఆర్గనైజింగ్ వింగ్ చైర్మన్ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

### వెనుకబడిన కులాల వారికి ప్రాధాన్యం ఇవ్వాలి

హిమాయత్‌నగర్,అక్టోబర్17: రాష్ట్రంలో వెనుకబడిన కులాల వారికి ప్రాధాన్యత ఇచ్చి అసెంబ్లీ సీట్లను అన్ని రాజకీయ పార్టీలు ఇవ్వాలని దళిత హక్కుల పోరాట సమితి నగర అధ్యక్షుడు ఆరుట్ల రాజ్‌కుమార్ కోరారు.మంగళవారం హిమాయత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అభివృద్ధికి ఆమడ దూరంలో ఉండి అన్ని రంగాల్లో వెనుకబడిన కులాలను గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ వ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దాడులను నిలువరించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందన్నారు.దేశ ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేస్తున్న మోదీ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు.



సమస్య పరిష్కారం: రాజామోహల్లాబస్తీలో పొంగుతున్న మురుగునీరు వల్ల స్థానికులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మిగౌడ్ మంగళవారం నారాయణగూడ జలమండలి సిబ్బందిని పిలిపించి శుభ్రం చేయించారు.

–హిమాయత్‌నగర్, అక్టోబర్17

### తప్పిన గ్యాస్ బాధలు



మారేడ్‌పల్లి, అక్టోబర్ 17: రూ. 400 లకే గ్యాస్ సిలిండర్ ఇవ్వడం ఎంతో సంతోషకరం.సీఎం కేసీఆర్ ఇటీవల ప్రకటించిన బీఆర్ఎస్ పార్టీ మ్యానిఫెస్టోలో అర్హులైన లబ్ధిదారులకు రూ.400 లకే గ్యాస్ సిలిండర్ ఇస్తానని ప్రకటించడం ఎంతో సంతోషకరంగా ఉంది.

ఈ. సుగుణ, అంబేద్కర్‌నగర్, గృహిణి